సాక్షి నంద్యాల

శనివారం ı 4 ı నవంబర్ ı 2023



ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం నుంచి 8వ తేదీ వరకు ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.



ప్రశాంతంగా 'సీస్'

జాతీయ సాధన పరీక్ష (సీస్) శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఈ పరీక్ష నిర్వహించింది. జిల్లాలో 31,012 మంది విద్యార్థులు పరీక్షను రాశారు. IIలో▸



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ముగిసిన ఫెన్సింగ్ క్రీడలు



బహుమతులు అందజేస్తున్న అతిథులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ మైదానంలో నిర్వహించిన 67వ ఏపీ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్‌-19 ఫెన్సింగ్ పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు క్రీడా సంస్థ రాష్ట్ర పరిశీలకులు రాఘవ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్, డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, ఎస్పీజీ హైస్కూల్ హెచ్‌ఎం జీవలత బహుమతులు అందజేశారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 20న జమ్మూకాశ్మీర్‌లో జరిగే స్కూల్ గేమ్స్ జాతీయ క్రీడల్లో పాల్గొంటారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి బత్తుల రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): స్థానిక కేఎస్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తనిఖీ చేశారు. అనంతరం సర్వ శిక్ష అభియాన్ కార్యాలయాన్ని తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈఓ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

జోరుగా ఎండుమిర్చి విక్రయాలు

నంద్యాల(సెంట్రల్): స్థానిక టెక్కె మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోలు జోరుగా సాగుతున్నాయని మార్కెట్‌యార్డు చైర్మన్ దేరెడ్డి మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం సూపర్‌-10 రకం గరిష్ట ధర క్వింటం రూ.23,900, మోడల్ ధర రూ.23 వేలు కాగా, కనిష్ట ధర రూ.20,200గా నమోదైనట్లు ఆయన తెలిపారు.

పింఛన్ల పంపిణీ 96.03 శాతం పూర్తి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో నవంబర్ నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. శుక్రవారం సాయంత్రానికి జిల్లాలో 96.03 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్ల పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు.

సిబ్బంది సమస్యలకు పరిష్కారం చూపుతాం



సమస్యను అడిగి తెసుకుంటున్న ఎస్పీ

బొమ్మలసత్రం: పోలీస్ సిబ్బంది సమస్యలకు సరైన పరిష్కారం చూపుతామని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పలు స్టేషన్‌లలో పనిచేసే సిబ్బంది మ్యూచ్‌వల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై వినతులు అందజేశారన్నారు. విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చామన్నారు.



ప్రగతి పరుగులు

బేతంచెర్ల పట్టణంలో ప్రగతి పరుగులు పెడుతోంది. ముప్పై ఏళ్లలో జరగని అభివృద్ధి కేవలం నాలుగేళ్లలో జరిగింది. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించింది. మేజర్ పంచాయతీగా ఉన్న బేతంచెర్ల నగర పంచాయతీగా పదోన్నతి పొంది సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. పారిశ్రామిక కేంద్రంగా పేరు గాంచిన బేతంచెర్లను ఏళ్లుగా వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్యకూ పరిష్కారం లభించింది.

- మంత్రి బుగ్గన చొరవతో అభివృద్ధి బాటలో బేతంచెర్ల
- మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్
- పారిశ్రామిక నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం
- ఈనెల 6న నాలుగు లేన్ల రహదారులు ప్రారంభం
- అదే రోజు రావు బహదూర్ బీపీ శేషారెడ్డి విగ్రహం ఆవిష్కరణ

బేతంచెర్ల: టీడీపీ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న బేతంచెర్ల పట్టణం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతోంది. రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బనగానపల్లె రైల్వే గేటు నుంచి సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీ, సర్వస్వతి విద్యామందిర్, సబ్ రిజిస్ట్రార్ కాలనీల మీదుగా నంద్యాల క్రాస్ రోడ్డు వరకు, బైటిపేట కల్లాల సంధు నుంచి కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ మాత అలయం వరకు రూ.6 కోట్లతో డబుల్ రోడ్డు పూర్తి చేయడంతో పట్టణంలో 20 ఏళ్లుగా వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో డబుల్ రోడ్డు మంజూరు చేయించడమే గాకుండా పనులు పూర్తి కావడంతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడింది.

30 పడకల ఆసుపత్రిగా మార్పు..

మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శేషారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.2.29 కోట్లతో సీహెచ్‌సీ ఆధునీకరణతో పాటు డైనింగ్ హాల్, మార్చురీ గది, ఆపరేషన్ థియేటర్, మౌలిక సదుపాయాలు కల్పించారు. వైద్యుల నియామకం కూడా పూర్తి కావడంతో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. బుగ్గానిపల్లె, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపాన, అల్లబకాష్ దర్గా వద్ద మూడు చోట్ల వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్స్ రూ.2.40 కోట్లతో నిర్మాణాలు పూర్తయ్యాయి. అలాగే నగర పంచాయతీ పరిధిలో సుమారు రూ.5 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించారు. సచివాలయాలు, ఆర్బీకేల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు పట్టణ వాసులకు స్థానికంగానే అందుతున్నాయి. డ్రైవర్స్ కాలనీ, సుబ్బారెడ్డి నగర్‌లో గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేశారు. బుగ్గానిపల్లె నుంచి బేతంచెర్ల వరకు నాగులులేన్ల రహదారి పూర్తి కావడంతో వాహనదారులకు ప్రయాణికులకు ప్రయాణం సులభతరమైంది.

6న అయ్యల చెర్వు, హెచ్ కొట్టాల రోడ్లు ప్రారంభం

అయ్యలచెర్వు నుంచి పట్టణం మీదుగా బనగానపల్లె రహదారిలోని కేజీబీవీ వరకు రూ.19.20 కోట్లతో నిర్మించిన నాలుగు లేన్ల రహదారికి డోన్ క్రాస్ రోడ్డు నుంచి హెచ్ కొట్టాల వరకు రూ.8.20 కోట్లతో నిర్మించిన నాలుగులేన్ల రహదారిని ఈనెల 6న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించనున్నారు. అదే రోజు ముందుగా పట్టణంలోని కర్నూలు, నంద్యాల రోడ్డు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన రావు బహదూర్ బీపీ శేషారెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించనున్నారు.



కర్నూలు, నంద్యాల రోడ్డు సర్కిల్లో ఏర్పాటు చేసిన రావుబహదూర్ శేషారెడ్డి విగ్రహం

పట్టణంలోని అభివృద్ధి పనుల్లో కొన్ని..

- ➡ రూ.1.60 కోట్లతో ఆర్టీసీ బస్టాండు ఆధునీకరణ
- ➡ రూ.60 లక్షలతో కోటపేట మోడల్ సంతమార్కెట్ నిర్మాణం.
- ➡ పట్టణ ప్రజలకు ఆహ్లాదం కోసం రూ.35 లక్షలతో ఎన్జీవోస్ కాలనీలో పార్కు ఏర్పాటు
- ➡ దుర్గాపేట కాలనీలో రూ.69.62 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు.
- ➡ సంజీవనగర్, జంగాల పేట కాలనీల్లో నూతనంగా సీసీ రోడ్లు, మురుగు కాల్వల ఏర్పాటు
- ➡ కొలుములపల్లె రహదారిలో రూ.60 లక్షలతో కొనసాగుతున్న మార్కెట్ యార్డు నిర్మాణం
- ➡ శ్రీనగర్ కాలనీలో రూ.18 లక్షలతో కొనసాగుతున్న రైతు బజార్ నిర్మాణం.

పట్టణ రూపురేఖలే మారిపోయాయి



నాలుగేళ్ల క్రితం పట్టణంతో పాటు ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు సరైన రహదారులు లేక ఇబ్బందులు పడుతుండేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి బుగ్గన చొరవతో పట్టణ రూపురేఖలే మారిపోయాయి. చుట్టూ రహదారులు కాకుండా, కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు ఏర్పాటు చేయడంతో పట్టణం ఆకర్షణీయంగా ఉంది.

– చింతల నాగిరెడ్డి, 2 వార్డు కౌన్సిలర్

కాలనీలు అభివృద్ధి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ఆర్థిక మంత్రి బుగ్గన అమలు చేస్తున్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత కల్పించడమే కాకుండా సుమారు రూ.330 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటి పథకం పనులు ప్రారంభించారు. దశల వారీగా కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నాం. రానున్న రోజుల్లో బేతంచెర్ల రూపు రేఖలు మారిపోనున్నాయి.

– నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి.

గుర్తుండిపోయే పనులు



ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఎప్పుడూ లేని విధంగా బేతంచెర్ల పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రధాన రహదారి వెంట నాలుగు లేన్ల రహదారి ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య పరిష్కారం కానుంది. 30 సంవత్సరాల్లో ఎప్పుడూ జరగని అభివృద్ధి ఈ నాలుగేళ్లలో జరిగింది. ఈ పనులు గుర్తుండిపోతాయి.

– సలీమ్, బేతంచెర్ల పట్టణం

సామాజిక సాధికార సత్తా చాటుదాం

- 7న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దాం
- జేసీఎస్ ఉమ్మడి కర్నూలు జిల్లా కన్వీనర్, వైఎస్సార్ కడప జెడ్పీ చైర్మన్ ఆకెపాటి అమరనాథరెడ్డి



మాట్లాడుతున్న ఆకెపాటి అమరనాథ్‌రెడ్డి. చిత్రంలో గంగుల ప్రభాకర్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఈనెల 7న ఆళ్లగడ్డలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు అన్ని వర్గాల నుంచి భారీగా హాజరై సామాజిక సత్తా చాటాలని జేసీఎస్ ఉమ్మడి కర్నూలు జిల్లా కన్వీనర్, వైఎస్సార్ కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఆకెపాటి అమరనాథరెడ్డి సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం బస్సు యాత్ర సన్నాహక సమావేశం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆకెపాటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఆళ్లగడ్డ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డా అని నిరూపించేలా పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి జగనన్న సీఎం మరోసారి ఎందుకు కావాలో ప్రతి ఒక్కరికీ వివరించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. రాజకీయ చరిత్రలో దేశంలో ఎక్కడా ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన తొలి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. అందుకే అందరం ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి సంక్షేమం, అభివృద్ధి గురించి చెబుతున్నామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు గత టీడీపీ పాలనలో ఎంత మేలు జరిగింది, ఎన్ని పదవులిచ్చారు, మన ప్రభుత్వంలో ఎంత మేలు జరిగిందనేది తెలియజేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు నరసింహారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రా రెడ్డి, వీరభద్రుడు, అమర్‌నాథ్‌రెడ్డి, వసీం, నాయకులు బాబూలాల్, కుమార్‌రెడ్డి, నాయబ్‌రసూల్, నాసారి వెంకటేశ్వర్లు, బత్తుల నాగేశ్వర్‌రావు, నాగన్న, బుడ్డా చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.



సమావేశానికి హాజరైన జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు

చేసింది చెప్పుకునేందుకే బస్సు యాత్ర

చేసింది చెప్పుకునేందుకే ఈ బస్సు యాత్ర. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమైంది. రాజ్యాంగంలో 33 శాతం మహిళకు రిజర్వేషన్లు అని పొందుపరిస్తే 55 శాతానికి పైగా రిజర్వేషన్లు ఇచ్చి మహిళలను అనేక పదవుల్లో అందలం ఎక్కించిన ఘనత సీఎందే. అబద్ధాలు రాసే పచ్చ మీడియా, అసత్యాలు ప్రచారం చేసే పచ్చ పార్టీల కుట్రలను తిప్పికొట్టాలి.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

జగన్ పాలనలో సామాజిక సమతుల్యత

సీఎం జగన్ పాలనలో ఏ విధంగా సామాజిక సమతుల్యత సాధించామో బస్సు యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్దాం. కులం, మతం, వర్గం చూడకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన తీరును ప్రజలకు చెబుదాం. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొంది ఉంటేనే మరోసారి జగనన్నకు ఓటేయమని అడుగుదాం. సంక్షేమఫలాలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే మరోసారి కచ్చితంగా జగనన్నే ముఖ్యమంత్రి కావాలనే విషయాన్ని ప్రజలకు వివరిద్దాం.

– గంగుల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు

యాత్రను విజయవంతం చేద్దాం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొదటిసారిగా ఆళ్లగడ్డ నుంచి మొదలవుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సామాజిక న్యాయం సాధ్యమైందనడానికి ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉన్న ఆరు మేజర్ గ్రామ పంచాయతీల్లో ఆరుకు ఆరు ఎస్సీ మహిళలను సర్పంచులను చేయడమే. ఇప్పటి నుంచి గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలో సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. మంగళవారం సాయంత్రం 3 గంటలకు ప్రారంభం కానున్న బస్సు యాత్రలో రాయలసీమ జిల్లాల ముఖ్య నేతలంతా పాల్గొంటారు. గతంలో జరిగిన సభలు, సమావేశాలకన్నా ఈ బస్సు యాత్ర చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలి.

– గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్యే

ఐకానిక్ వంతెన ఏర్పాటుకు కృష్ణాతీరం పరిశీలన



కృష్ణానదిలో బోటులో నుంచే ఐకానిక్ వంతెన ఏర్పాటుకు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఐకానిక్ వంతెన ఏర్పాటుకు ఏపీ ఫైర్‌డిపార్ట్‌మెంట్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ శుక్రవారం కృష్ణాతీరాన్ని పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నేషనల్ హైవే 167కె ఏర్పాటులో భాగంగా కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. బోటులో ఆయన కృష్ణానదిలో ప్రయాణించి రెండు తెలుగు రాష్ట్రాల హద్దులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతీయరహదారి వెళ్లనున్న గ్రామాలతో పాటు నల్లమల అటవీ ప్రాంతం పూర్తి సమాచారాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యాటక పరంగా ఏ విధమైన అభివృద్ధి అక్కడ సాధ్యమవుతుందో తెలుసుకున్నారు. కృష్ణానది జలాల నుంచి బయల్పడుతున్న ప్రాచీన సంగమేశ్వరాలయాన్ని మరబోటులో నుంచే తిలకించారు. అనంతరం సప్తనదుల సంగమ ప్రాంతాన్ని, అక్కడ వెలసిన ఉమామహేశ్వరాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సర్కిల్ సీఐ నాగభూషణ్, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎస్‌ఐ హుస్సేన్ బాషా ఉన్నారు.

కార్గో సేవ..మరింత చేరువ

- ఆర్టీసీలో కార్గో ప్రచార మాసోత్సవం
- అందిస్తున్న సేవలపై వివిధ వర్గాలకు అవగాహన
- గత ఏడాది రూ.3.96 కోట్ల ఆదాయం
- ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ 1.9 కోట్ల ఆర్జన
- ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి
- మరింత సమర్థవంతంగా కార్గో సేవలకు శ్రీకారం

ఇంటికే పార్సిళ్లు, కొరియర్లను పంపిణీ చేసే డోర్ డెలివరీ వ్యవస్థను మరింత విస్తృతం చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే అందిస్తున్న ఆర్టీసీ డోర్ డెలివరీ సదుపాయాన్ని మరింత చేరువ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. 2021 సెప్టెంబర్ 1 నుంచి ఆర్టీసీలో డోర్ డెలివరీ సేవలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ ఆత్మకూరు, డోన్ పట్టణాల్లో 10 కిలోమీటర్ల పరిధి వరకు డోర్ డెలివరీ సేవలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. డోర్ డెలివరీ సేవలు మరింత కచ్చితంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– నంద్యాల టౌన్

ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ డోర్ డెలివరీ సేవలు మరింత పకడ్బందీగా అందించేందుకు చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా అక్టోబర్ 26 నుంచి ఈ నెల 25 వరకు నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఆర్టీసీ పార్సిల్, కొరియర్, సరకు రవాణాలో భాగస్వాములయ్యే కాంట్రాక్టర్లు, ఏజెంట్లు, ఆపరేటర్లతో సమావేశం కానున్నారు. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీసులు, వాణిజ్య సముదాయాలు, కిరాణా స్టోర్లు, ఆలయాలు, విద్యా సంస్థలు, అపార్ట్‌మెంట్లకు వెళ్లి ఆర్టీసీ డోర్ డెలి వరీ సదుపాయంపై వివరించనున్నారు. ఇంకా ఫ్లెక్సీల ఏర్పాటు, కరపత్రాల పంపిణీతో పాటు సినిమా హాళ్లు, లోకల్ టీవీలు, బిగ్ స్క్రీన్లపై ఆడియో, వీడియోలను ప్రదర్శించనున్నారు. ఇందుకు ఆర్టీసీ ఉద్యోగులు కూడా విధిగా సహకరించాలని కోరుతున్నారు. ప్రముఖులను, స్థానిక అధికారులను ఆహ్వానించి డిపోల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు.



కార్గోలో ఉన్న పార్సిళ్లు

పార్సిల్/కొరియర్	ధర
0-1 కిలో	రూ.18
01-06 కిలోలు	రూ.30
06- 10 కిలోలు	రూ.36
10- 25 కిలోలు	రూ.48
25-50 కిలోలు	రూ.59



కార్గో బస్సు

రూ.35 లక్షలతో నూతన భవనం..

కార్గో సేవలు మరింత విస్తృతంగా అందించాలనే లక్ష్యంగా నంద్యాల ఆర్టీసీ డిపో పరిధిలో రూ.35 లక్షలతో నూతన పార్సిల్ బుకింగ్ కార్యాలయాన్ని గత నెల 5న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా ప్రారంభించారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, ముఖ్య పట్టణాలు అన్నీ కలిపి 84 ప్రాంతాల్లో 50 కేజీల వరకు 10 కిలోమీటర్లలోపు డోర్ డెలివరీ సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని పార్సిల్ బుకింగ్ కేంద్రాల్లో రోజుకు సగటున 1,200 వరకు పార్సిళ్లు బుక్ చేసుకుంటున్నారు. రోజుకు సగటున 1,000 వరకు డోర్ డెలివరీ సేవలు అందుతున్నాయి. ఈ సేవలు మరింత విస్తృతం చేయాలని ఆర్టీసీ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. డోర్ డెలివరీ చేయడానికి గతంలో జోన్ల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇకపై రాష్ట్రం మొత్తం మీద సింగ్ సొల్యూషన్స్ సంస్థకు అప్పగించారు. దీని వల్ల ఏదైనా సమస్య తలెత్తినా ప్రధాన కేంద్రం నుంచే సరిచేసే వీలుంటుందని భావిస్తున్నారు. పార్సిల్ బుక్ చేసే సందర్భంలోనే డోర్ డెలివరీ చార్జీలు కూడా చెల్లించి, చిరునామా, ఫోన్ నంబర్ ఇతర వివరాలు అందజేసి డోర్ డెలివరీ సదుపాయం పొందవచ్చు.

జిల్లాలో డిపోల వారీగా వచ్చిన ఆదాయం (రూ. లక్షల్లో)

డిపో	2022-23లో ఆదాయం	2023లో సెప్టెంబర్ వరకు ఆదాయం
నంద్యాల	210.05	108.63
ఆళ్లగడ్డ	45.50	20.95
ఆత్మకూరు	40.54	20.27
బనగానపల్లె	11.89	8.58
డోన్	48.86	17.64
కోవెలకుంట్ల	8.96	4.75
నందికొట్కూరు	30.48	13.95
మొత్తం	396.3	194.77

కార్గో సేవలు విస్తృతం



ఆర్టీసీ కార్గో సేవలపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. ఆర్టీసీ ద్వారా బుక్ చేసిన సరకులు, పార్సిళ్లు, కొరియర్లను ఇతర సంస్థలకు ధీటుగా రాష్ట్రంలో 24 గంటల్లోనే డెలివరీ చేస్తున్నాం. ప్రజాదరణ పొందిన ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలను విసతఈస్తృతం చేస్తున్నాం. దీని వల్ల ప్రజలకు మరింతగా చేరువవుతాం. డోర్ డెలివరీ ప్రచారం తర్వాత పికప్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెస్తాం. ప్రజలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలి.

– శ్రీనివాసరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి

డిజిటల్ పేమెంట్లు..

ఆర్టీసీలో కార్గో సేవలు పారదర్శకంగా అందించడానికి యాజమాన్యం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. కార్గో సెంటర్లలో డిజిటల్ పేమెంట్లు అమలు చేస్తున్నారు. ఫోన్ పే, గూగుల్ పే తదితర సౌకర్యాలను కల్పిస్తున్నారు. అన్నీ కార్గో సెంటర్లలో సులభంగా పేమెంట్ చేసే సౌకర్యాలు ఏర్పాటు చేశారు.


వేడివేడిగా..


చేపల ఫ్రై..రుచి చూడండి



పచ్చళ్లు కూడా ఉన్నాయి.. తీసుకోండి


స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

చేపలు ఘుమఘుమ.. రొయ్యలు నోరూరా!

రకరకాల చేపలు.. విభిన్న రకాల రొయ్యలు.. వాటితో చేసిన ప్రత్యేక వంటకాలు.. శుక్రవారం కర్నూలు నగరంలోని రావూరి గార్డెన్‌లో ఘుమఘుమలాడాయి. ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్‌కు వచ్చిన ప్రజల నోరూరించాయి. వేపుళ్లు, పచ్చళ్లతో ఏర్పాటు చేసిన స్టాళ్లు సందడిగా కనిపించాయి. ఫెస్టివల్‌కు వచ్చిన ప్రజలకు చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే లాభాలను అధికారులు వివరించారు. ప్రజాప్రతినిధులు స్టాళ్లను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. బఫే ఫుడ్ కోర్టులో రూ.399కే అన్‌లిమిటెడ్‌గా చేపలు, రొయ్యల వంటకాలను తినే అవకాశాన్ని మత్స్యశాఖ కల్పించింది. –సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు


ఫిష్ బాల్స్ కొనుగోలు చేస్తూ..


ఎండు చేపల స్టాల్..


చేపలు భలే ఉన్నాయి..



ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకోండి

నంద్యాల: వచ్చే సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సూచించారు. శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తప్పులు లేని ఓటర్ల జాబితా, మార్గదర్శకాల మేరకు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఈవీఎం, ప్లానింగ్, పోలింగ్ సిబ్బంది, పోస్టల్ బ్యాలెట్ పేపర్, లా అండ్ ఆర్డర్, ఎన్నికల వ్యయం, పర్యవేక్షణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ తదితర అంశాలపై క్రమ పద్ధతిలో పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్ వాటి సంబంధిత పరికరాలను భద్ర పరుచేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రత ప్రమాణాలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు చేపడుతున్న ఏర్పాట్లను వివరించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పోలీస్ స్టేషన్ల రేషనలైజేషన్ తదితర అంశాలపై ప్రతివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి సూచనలను పరిగణలోకి తీసుకొని ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

● జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): పెన్షనర్లు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ట్రెజరీ ఉప సంచాలకులు రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం సీ.క్యాంపు సెంటరులోని కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీలో పెన్షనర్స్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎటువంటి సమస్య ఉన్నా తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. పెన్షనర్లకు సబ్ ట్రెజరీల్లో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కర్నూలు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి వివిధ సమస్యలను జిల్లా ట్రెజరీ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో కర్నూలు సబ్ ట్రెజరీ ఏటీవో రఘువీర్, పెన్షనర్ల సంఘం నేతలు విజయ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు సుబ్రమణ్యం, మద్దిలేటిరెడ్డి, యూజీసీ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధి నరసయ్య, ఎస్‌టీఓ అంజాద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు



శ్రీశైలం డ్యాంలో 66 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 66.5540 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయ నీటిమట్టం 843 అడుగులకు చేరుకుంది. గురువారం నుంచి శుక్రవారం వరకు దిగువ ప్రాంతాలకు 8,282 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భజలవిద్యుత్ కేంద్రంలో 1.690 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, నాగార్జునసాగర్‌కు 3,544 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 858 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,320, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

కర్నూలు మార్కెట్‌లో రైతులకు రూ.15కే భోజనం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మధ్యాహ్నం రూ.15 కే భోజనం అందిస్తున్నారు. ప్రతి ఏటా జరిగే కార్యక్రమమే అయినందున ఎలాంటి ఆడంబరం లేకుండా ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఒక భోజనానికి మార్కెట్ కమిటీ రూ.20 భరిస్తుంది. రైతులు రూ.15 చెల్లించాల్సి ఉంది. మిగిలిన మొత్తాన్ని ఇస్కాన్ భరిస్తుంది. రోజుకు దాదాపు 400 మంది రైతులకు ప్రయోజనం కలుగుతోంది. రైతులు మార్కెట్‌లోకి సరుకు తీసుకుని ప్రవేశించేటప్పుడే మెయిన్ గేట్‌లో భోజనానికి సంబంధించిన టోకెన్ ఇస్తారు.

ప్రశాంతంగా జాతీయ సాధన పరీక్ష

కర్నూలు కల్చరల్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో జాతీయ సాధన పరీక్ష (సీస్) ప్రశాంతంగా జరిగింది. విద్యార్థుల్లో ఉన్న చదువు సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పరీక్షను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నిర్వహించింది. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ప్రైవేట్ యాజమాన్యాల్లో 718 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 3, 6, 9 తరగతి చదువుచున్న 31,012 మంది విద్యార్థులు పరీక్షను రాశారు. జిల్లా విద్యాశాఖాధికారి వి.రంగారెడ్డి పరీక్ష కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

● జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

దేవనకొండ: జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయొద్దని, ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. శుక్రవారం ఉదయం దేవనకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జనగన్నకు చెబుదాం–స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సంతృప్తిస్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎక్కువ శాతం రెవెన్యూ సమస్యలు వచ్చాయని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాలకు వీఆర్వోలు కూడా వచ్చేవిధంగా ఆదేశాలు జారీ చేయాలని ఇన్‌చార్జి సీపీఓని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి 130 మంది అర్జీలు వచ్చాయి. పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి, దేవనకొండ తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఎంపీడీఓ గౌరీదేవి, ఎంఈఓ తిమ్మారెడ్డి, వివిధ శాఖలకు చెందిన జిల్లా, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

గోనెగండ్లలో పట్టపగలే చోరీ

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అచ్చుకట్ల వీధి షాదిఖాన సమీపంలో దేశాయ్ రహమతుల్లా నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి భార్య షాహిదాబీతో కలసి కూలీ పనులకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దొంగలు సాయంత్రం ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని నగలను అపహరించారు. శబ్దం రావడంతో చుట్టు పక్కల వారు గమనించి, దొంగలు ఉన్నట్లు గుర్తించి, పట్టుకునేందుకు యత్నించగా పారిపోయారు. కూలీ పనుల అనంతరం ఇంటికి వచ్చిన రహమతుల్లా, షాహిదాబీ బీరువాను పరిశీలించగా అందులో ఉన్న రూ.3లక్షల నగదు, 3 తులాల బంగారు, 20 తులాల వెండి చోరీ జరిగినట్లు తెలుసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

వ్యభిచార కూపంలోకి విద్యార్థినులు?

● అదుపులోకి తీసుకున్న ఆదోని పోలీసులు

ఆదోనిఅర్బన్:కొంతమంది కళాశాల విద్యార్థినులు వ్యభిచార కూపంలోకి దిగి, ఆదోని పోలీసులకు పట్టుబడినట్లు తెలుస్తోంది. పట్టణంలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని త్రీటౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఎనిమిది మంది విటులు, ఇద్దరు నిర్వాహకులు, కొంతమంది కాలేజీ విద్యార్థినులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు నిర్వాహకులను విచారించగా కర్నూలులో కూడా సెక్స్‌రాకెట్ నిర్వహిస్తున్నట్లు తెలపడంతో అక్కడ కూడా దాడులు చేసి మరి కొంతమందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.కలకత్తా, బెంగళూరు, ధర్మవరం,హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి అమ్మాయిలను పిలిపించి సెక్స్ రాకెట్ నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై త్రీటౌన్ సీఐ నరసింహరాజు మాట్లాడుతూ.. విచారణ జరుపుతున్నామని,శనివారం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలియజేశారు.



గ్రూప్–1 అధికారులకు ఇంట్రడక్షన్ ట్రైనింగ్


చెంచుల స్థితిగతులను వివరిస్తున్న అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: పదమూడు మంది గ్రూప్–1 ట్రైనీ అధికారులకు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఇంట్రడక్షన్ ట్రైనింగ్ ఇచ్చారు. చెంచుగిరిజనుల జీవనశైలి, వారికి అందుతున్న ప్రభుత్వం ఫలాలను పీఓ డాక్టర్.బి.రవీంద్రారెడ్డి వివరించారు. వారి వెంట ఏపీఓ ఎ.సురేష్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ బి.సి ధనుంజయ తదితరులు ఉన్నారు.

